సాక్షి
శ్రీకాకుళం
గురువారం ౹ 5 ౹ జూన్ ౹ 2025



'నవోదయం' పిలుస్తోంది..!

జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. - 12లో



ఆధ్యాత్మిక శోభ

కంచమ్మ తల్లి ఉత్సవాలతో కంచిలి ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. - 12లో

బీఈడీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం విడుదల చేశారు. జిల్లాలో 14 కళాశాలల్లో 1036 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 944 మంది ఉత్తీర్ణలయ్యారని, 91.12 ఉత్తీర్ణత శాతం నమోదైందని పేర్కొన్నారు. ఫలితాలను జ్ఞాన భూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 15 రోజుల్లోగా రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి పాఠశాలలకు ఉపాధ్యాయులు

శ్రీకాకుళం : ఉపాధ్యాయులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. వారం రోజులుగా ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వస్తున్న విద్యా శాఖ ప్రస్తుతం వారి బదిలీలకు సంబంధించిన ఆప్షన్లు తీసుకుంటోంది. గురువారంతో ఈ గడువు ముగియనుండగా మరుసటి రోజు నుంచి బదిలీలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో సంసిద్ధత పేరుతో ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేయటం గమనార్హం. గత ప్రభుత్వ పాలనలో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలను ఏప్రిల్ 29 వరకు నిర్వహించినప్పుడు ఆందోళన వ్యక్తం చేసిన ఉపాధ్యాయ సంఘాలు వారం రోజులు ముందుగానే పాఠశాలలను ప్రారంభిస్తున్నా స్పందించకపోవటాన్ని పలువురు టీచర్లు తప్పుపడుతున్నారు.

రెండు కిలోమీటర్లు నడిస్తేనే రేషన్



రేషన్ సరుకులతో భద్రాచలం గ్రామస్తులు

సారవకోట: కిడిమి పంచాయతీ భద్రాచలం గ్రామస్తులు రేషన్ సరుకులు తీసుకోవాలంటే రెండు కిలోమీటర్లకు పైగా నడిచి డిపోకు చేరుకోవాల్సిందే. గత ప్రభుత్వంలో వాహనం గ్రామానికే రావడంతో రేషన్ సరుకులు సులభంగా తీసుకునే అవకాశముండేదని, కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని నిలుపుదల చేయడంతో మండుటెండలో నడుచుకుంటూ వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు లక్షల మొక్కలు లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రకృతి పరిరక్షణకు కట్టుబడి, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గురువారం ఒక్క రోజే ఐదు లక్షల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించే ఈ కార్యక్రమంలో ప్రతి శాఖ, ప్రతి మండలానికి స్పష్టమైన లక్ష్యాలు విధించామని, సహకరించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సరిగ్గా ఏడాది క్రితం అబద్ధపు హామీలతో అధికారాన్ని దొరకబుచ్చుకున్నారు. ప్రజల నుంచి ఓట్లు దండుకుని.. వారికే పంగనామాలు పెట్టారు. ఇచ్చిన హామీలు కాకుండా.. ఏడాది కాలంగా కొత్త కథలు చెబుతూ నమ్మి అధికారం కట్టబెట్టిన ప్రజలకే వెన్నుపోటు పొడిచారంటూ జనం రోడ్లపైకి వచ్చారు. వెన్నుపోటు సర్కారుపై నిరసన ప్రకటిస్తూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజావాహిని నిరసనల జోరుతో ఊరూవాడా దద్దరిల్లింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి.

పెల్లుబికిన ప్రజాగ్రహం

- జిల్లాలో వెన్నుపోటు దినం నిరసనకు విశేష స్పందన
- కూటమి సర్కారుపై భగ్గుమన్న ప్రజలు
- చంద్రబాబు నమ్మించి మోసగించారంటూ మండిపాటు
- జిల్లావ్యాప్తంగా నిరసన ర్యాలీలు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, మహిళలు



మహిళా ద్రోహి చంద్రబాబు

ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పడం.. అధికారం చేపట్టాక మోసం చేయడం చంద్రబాబుకు అలవాటైపోయింది. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మహిళలంతా ఓటేసి మోసపోయాం. సొంత మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకి అమాయక ఆంధ్రా ప్రజలకు వెన్నుపోటు పొడవడం పెద్ద వింతకాదు. సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయకుండా వెన్నుపోటు పొడిచారు. - బెండి పూర్ణ, పాత్రునివలస జగనన్న కాలనీ

(శ్రీకాకుళం నగరంలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో..)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రోజిది. ఓట్లేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచిన రోజిది. అప్పుడు మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారనుకుంటే.. ఏడాది కాలంగా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారు' అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి జిల్లా ప్రజలు గొంతెత్తారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై కదం తొక్కారు. కిలోమీటర్ల మేర పాదయాత్రగా ర్యాలీ చేశారు. నిరసన ర్యాలీలతో జిల్లా హోరెత్తిపోయింది. కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు, అడ్డంకులు సృష్టించినా ఎక్కడా తగ్గలేదు. అన్నింటిని అధిగమించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. నిరసనపై ఉక్కుపాదం మోపేందుకు గత వారం రోజులుగా అనుమతుల విషయంలో కుట్ర పన్నినా పారలేదు. వైఎస్సార్‌సీపీ కేడర్‌తో పాటు సామాన్య జనం నిరసన ర్యాలీల్లో వేలాదిగా పాల్గొన్నారు. దీంతో పార్టీలో నూతనోత్తేజం కనిపించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.



జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ..

నమ్మిన ప్రజలను నట్టేట ముంచారని జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చి నినదించారు. వేలాది మంది ఏడు రోడ్ల కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. దీంతో ప్రధాన రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ర్యాలీ అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన ప్రదర్శనలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, రాష్ట్ర తూర్పు కాపు విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, రాష్ట్ర కళింగ వైశ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, చిట్టి జనార్దన్ రావు, అంబటి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురంలోని దాసన్నపేట జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆధ్వర్యంలో వేలాది మందితో భారీ నిరసన ప్రదర్శన చేశారు. వేలాది మంది తరలిరావడంతో ఇచ్ఛాపురం కిటకిటలాడింది.

హామీల అమలు చేసేదెప్పుడు?



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదు. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ప్రతి విద్యార్థికి నీకు రూ.15వేలు.. నీకు రూ.15వేలు అని చెప్పారే తప్ప ఏడాదవుతున్నా ఇవ్వలేదు. మిగిలిన అన్ని వర్గాలను మోసం చేశారు.
- పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

అప్పులు చేయడమేనా..



20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి, కోటీ 20 లక్షల మంది రైతులకు రూ.20వేలు చొప్పున అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పేరిట విద్యార్థులకు రూ.15వేలు.. ఇలా అనేక హామీలు గుప్పించి అమలు చేయకపోవడం దారుణం. ఇప్పటివరకు రూ.లక్షా నలభై వేల కోట్ల రూపాయలు అప్పులు చేశారు.
- కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



పాతపట్నంలో..

పాతపట్నంలోని పాతబస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. కోర్టు కూడలి, వైఎస్సార్ విగ్రహం జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేసి, ప్రభుత్వం తీరును దుయ్యబట్టారు.. చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త రెడ్డి శాంతి నేతృత్వంలో జరిగిన నిరసన ప్రదర్శనలో ప్లకార్డులు పట్టుకుని కూటమి ప్రభుత్వం తీరుపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

పాతపట్నం నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అన్నింటా విఫలం..



అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలుకు అడుగులు వేయలేదు. నిరుపేదలను ఆదుకునే ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేశారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది.
- రెడ్డి శాంతి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు



టెక్కలిలో..

వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంతో టెక్కలి అట్టుడికిపోయింది. మాజీ స్పీకర్, పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జంక్షన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వేలాది మందితో నిరసన ర్యాలీ సాగింది. రాష్ట్ర కాళింగ విభాగం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావుతో పాటు భారీ సంఖ్యలో జనం నిరసన తెలియజేశారు.

టెక్కలి నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కూటమి కోటలు బద్దలవ్వాలి..



కూటమి ప్రభుత్వం కోటలను బద్దలు కొట్టడానికి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నాంది పలకాలి. - తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త

అన్ని వర్గాలకు మోసం..



సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి నాయకులంతా అధికారాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. - పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త



నరసన్నపేటలో..

నరసన్నపేటలో అంబేడ్కర్ విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రజల బాగోగులు పట్టవా?



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో లెక్కకు మించి అరాచకాలు జరిగాయి. అధికార పార్టీ కార్యకర్తల శ్రేయస్సు తప్ప ప్రజల బాగోగులు పట్టడం లేదు. యువతకు, రైతులకు, మహిళలకు, తల్లులకు ఇలా అన్ని వర్గాలకూ ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం మోసం చేసింది. టీడీపీ నాయకులు దోపిడీ పాలన సాగిస్తున్నారు. - ధర్మాన కృష్ణచైతన్య, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు



ఆమదాలవలసలో..

ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వేలాదిగా తరలివచ్చిన శ్రేణులు, ప్రజలతో నిరసన కార్యక్రమం ఆద్యంతం హోరెత్తింది. తొలుత కంద్రపేట జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు.



చంద్రబాబు, లోకేష్ మాస్కులు ధరించి వెన్నుపోటును వివరిస్తూ..

అన్ని వర్గాలపై భారం..



చంద్రబాబు హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను జైల్లో పెడుతున్నారు. విద్యుత్, ఇతర చార్జీలు పెంచేసి ప్రజలపై భారం మోపారు.
- చింతాడ రవికుమార్, వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త

ఆమదాలవలస నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పలాసలో...

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో కాశీబుగ్గలో వేలాది మందితో నిరసన ర్యాలీ జరిగింది. అనంతరం కేటీ రోడ్డు మీదుగా పలాస కాంప్లెక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించి అడ్డుకున్నారు. వివేకానంద విగ్రహం వద్ద మానవహారం చేపట్టి అనంతరం విరమించుకుంటామని వినయపూర్వకంగా చెప్పినా తక్షణమే నిలిపివేయాలని డీఎస్పీ వెంకట అప్పారావు, పోలీసులు, ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బంది కార్యకర్తలను, నాయకులను చెదరగొట్టారు.

పలాస నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రశ్నిస్తే కేసులే..



సూపర్ సిక్స్ హామీలపై ఎవరు ప్రశ్నించినా కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో లోకేష్ జీఎస్టీ అంటూ రహస్యంగా వసూలు చేస్తున్నారు. అదే పంథాలో పలాస నియోజకవర్గంలో అల్లుడు ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. - డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ సమన్వయకర్త





ఎచ్చెర్లలో...

మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేశారు. వేలాది మంది పాల్గొని, మండు టెండలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో వెన్నుపోటు దినం కార్యక్రమం వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

భయపడేది లేదు..



ఎన్నికల హామీలను నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను వేధిస్తున్నారు. ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదు. సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పి ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. - గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్త

క్లుప్తంగా

అక్రమ భవన నిర్మాణం అడ్డగింత



నిర్మాణ పనులు నిలిపివేసిన దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని కేటీ రోడ్‌లో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మితమవుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ బేఖాతరు చేసి సదరు బిల్డింగ్ యజమాని నిర్మాణ పనులను కొనసాగిస్తుండగా, కమిషనర్ నడిపిన రామారావు ఆదేశానుసారం పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సిబ్బంది సదరు నిర్మాణ పనులను బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలో ఎవరైనా అక్రమ నిర్మాణాలను చేస్తే సదరు బిల్డింగ్ యజమానులపై కేసులు వేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అక్రమ భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, నిబంధనల మేరకు నడుచుకోవాలని హెచ్చరించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల మండల పరిధిలోని శ్రీకాకుళం సింహద్వారం సమీపంలో నలుగురు జూదరులు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.14500 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి



కల్యాణ్ మృతదేహం

కంచిలి: గ్రామదేవత ఉత్సవాల్లో స్టేజీ ప్రోగ్రామ్ ఇచ్చేందుకు వచ్చిన ఒక కళాకారుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన బుధవారం కంచిలిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి కంచిలి ఉత్సవాల్లో భాగంగా సినీ డూప్స్ స్టేజీ ప్రోగ్రాం ఇచ్చేందుకు కళాకారుల బృందం ఉదయమే వచ్చారు. వీరు మంగళవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడలో ప్రదర్శన ఇచ్చి, అటునుంచి ఇక్కడికి వచ్చారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకోడానికి స్థానిక మఠం చెరువు వద్దకు వెళ్లారు. వీరిలో బాలకృష్ణ డూప్‌గా నటిస్తున్న సప్ప కల్యాణ్(65) చెరువు గట్టు మీద ఒక చెట్టుకింద కూర్చొని గుండెనొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. ఇతనిది విశాఖపట్నం జిల్లా గాజువాక పెద్దగంట్యాడ ప్రాంతం. తోటి కళాకారుడు మృతి చెందడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఈ ప్రదర్శనను రద్దు చేశారు.

నవోదయం పిలుస్తోంది..!

- 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- జూలై 29 వరకు దరఖాస్తులకు గడువు
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ:

జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో ప్రవేశాలకు పిలుపొచ్చింది. వచ్చే 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. గ్రామీణ విద్యార్థులకు మంచి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడంతో పాటు జాతీయ భావం, జాతీయ సమైక్యతకు కృషి చేయాలనే ఆశయాలతో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఇక్కడ 6 నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ విద్యతో పాటు హాస్టల్ వసతి సౌకర్యంను కల్పిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సరుబుజ్జిలి మండల పరిధిలోని వెన్నెలవలసలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు నవోదయలో సీటు రావాలని కలలు కంటారు. 100 మార్కులకు దాదాపు 90 మార్కులపైబడి సాధిస్తేనే సీటు దొరికే అవకాశం ఉంటుంది. తాజాగా నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నవోదయ విద్యాలయం ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం, అక్కడ లభిస్తున్న సదుపాయాలు వసతులు తదితర అంశాలను ఒకసారి పరిశీలిద్దాం...

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

2026–27 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. https://cbseitms.rcil. gov.in/ nvs/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి అనుమతిస్తారు. దీనికి ఆఫ్‌లైన్ విధానమనేది లేదు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల జూలై 29వ తేదీ వరకు గడువు విధించారు. డిసెంబర్ 13వ తేదీన జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.



వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం

5వ తరగతి చదువుతున్నవారు అర్హులు

జేఎన్‌వీల్లో 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నిర్దేశించారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, విభిన్నప్రతిభావంతుల(దివ్యాంగులు)కు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వరుసగా 3, 4 తరగతి చదివి.. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అలాగే విద్యార్థులు 2021–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చదువుతూ 2014 మే ఒకటి నుంచి 2016 జూలై 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.



విభిన్న రంగాల్లో రాణించేలా..

వసతులు, సౌకర్యాల కల్పన భేష్

శ్రీకాకుళం జిల్లాలోని సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించారు. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఆటపాటలు, యోగా వంటివి నిర్వహిస్తుంటారు. విద్యార్థుల కోసం వ్యాయామశాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతుల కొనసాగిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలు ఉన్నాయి.

ప్రణాళికతో చదివితే సీటు

6వ తరగతిలో 80 సీట్లను నింపుతారు. ఇందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తారు. కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. 6వ తరగతి మొదలుకుని 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తారు. ఏడు ప్రాంతీయ భాషల్లో, మాతృభాషల్లో బోధన జరుగుతుంది. పదో తరగతి వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)ను అమలు చేస్తారు. సమయం కేటాయించి ప్రణాళిక బద్ధంగా చదివితే సీటు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. మొత్తం 80 ప్రశ్నలకు 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో మెంటల్ ఎబిలిటీ నుంచి 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ నుంచి 20 ప్రశ్నలు– 25 మార్కులు, లాంగ్వేజ్ నుంచి 20 ప్రశ్నలు–25 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే పరీక్ష జరుగుతుంది. మాథ్స్, సైన్స్, ఇంగ్లిషు సబ్జెక్టులపై 5వ తరగతి వరకు పాఠాలపై పూర్తిగా అవగాహన పెంచుకుని, పూర్వపు జేఎన్‌వీ పరీక్ష పేపర్లను, పాత మోడల్ పేపర్లను పూర్తిగా సన్నద్ధం చేయగలిగితే మంచి మార్కుల సాధనకు అవకాశం ఉంటుందని నిష్టాతులు చెబుతున్నారు.



స్మార్ట్ బోధన, ఆన్‌లైన్ పాఠాల్లో నిమగ్నమైన విద్యార్థులు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేఎన్‌వీలు వరమనే చెప్పాలి. గొప్ప అవకాశంగా భావించి, సద్వినియోగం చేసుకోవాలి. జూలై 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. తల్లిదండ్రుల కృషి, విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకున్నట్లయితే మంచి స్కోర్‌కు ఛాన్స్ ఉంది. సీటు పొందవచ్చు.

– దాసరి పరశురామయ్య, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, వెన్నెలవలస, సరుబుజ్జిలి



శిక్షణా శిబిరాల ముగింపులో సాధన చేస్తున్న తైక్వాండో క్రీడాకారులు

ముగిసిన శిక్షణ శిబిరాలు

శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ముగిశాయి. నెల రోజులపాటు నిర్వహించిన ఈ శిబిరాల్లో ఉదయం, సాయంత్రం క్రీడాకారులు సాధన చేశారు. 8 ఏళ్ల పైబడిన బాలబాలికలతోపాటు ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణలో నైపుణ్యాలు సాధించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించిన శిబిరాలతో పాటు ఆయా క్రీడాసంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. కోచ్‌ల పర్యవేక్షణలో ఫిట్‌నెస్‌తో పాటు వారివారి క్రీడాంశాల్లో సరికొత్త మెలకువలు నేర్చుకున్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ

త్యాగం చేశాం.. న్యాయం చేయండి

- ఆఫ్‌షోర్ నిర్వాసితుల విన్నపం

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్ కోసం సర్వం త్యాగం చేసిన తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. చీపురుపల్లిలో నిర్వాసితులు చేపడుతున్న దీక్ష శిబిరాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిలు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి నిర్వాసితులు వినతిపత్రాలు అందజేశారు. ప్రాజెక్టు కోసం సొంతూరు, స్థలాలు, పొలాలు, ఇళ్లు త్యాగం చేసిన తమ న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు ప్రారంభించి 16 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నిర్వాసితులకు న్యాయం జరగలేదన్నారు. బడ్జెట్ ప్రతీ ఏడాది పెరుగుతున్నా.. నిర్వాసితుల సమస్యలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం 460 జీవో ప్రకారం హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన ప్రాప్తికి ప్యాకేజీలు అందించాలని, ఇప్పటికీ కూడా 132 మందికి ప్యాకేజీలు పెండింగ్ ఉన్నాయన్నారు. సోషల్ ఎకనామిక్‌లో లేని 40 కుటుంబాలకు వెంటనే సర్వేచేసి పరిహారాలు అందజేయాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. పునరావాస కాలనీల్లో ఇప్పటికీ రహదారులు, వీధిదీపాలు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, నిర్వాసితుల రాష్ట్ర కార్యదర్శి గంగారపు సింహాచలం, సీపీఐ కార్యదర్శి చాపర వెంకటరమణ, దొర విజయ్ కుమార్, కిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు అందజేస్తున్న నిర్వాసితులు

కిక్కిరిసిన కాంప్లెక్స్



నాన్‌స్టాప్ బస్సుల టికెట్లు కోసం క్యూలో ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రయాణికులతో రద్దీమయంగా కనిపించింది. బుధవారం అధికంగా పెళ్లిళ్లు ఉండడంతో వాటికి హాజరయ్యేందుకు దూరప్రాంతాల నుంచి, మారుమూల ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించడంతో కిక్కిరిసిపోయింది. దీంతో ప్రయాణికులు దూర ప్రాంతాల కోసం నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద బారులుతీరుతూ కనిపించారు. అలాగే నాన్‌స్టాప్ పోర్టికో వద్ద కూడా ప్రయాణికులు వారి లగేజీ బ్యాగులు, సూట్‌కేస్‌లతో బస్సుల కోసం వేచి ఉండడం కనిపించింది.

బైక్‌తో గేదెను ఢీకొని వ్యక్తి మృతి



రిమ్స్‌లో భజరంగ బాధ్యత మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట ఎన్‌హెచ్–16 వద్ద మంగళవారం రాత్రి గేదెను ద్విచక్ర వాహనంతో ఢీకొని రోడ్డుపై పడి ఒడిశాకు చెందిన వ్యక్తి తీవ్రగాయాలపాలై రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎచ్చెర్ల ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా తిహిగిరియా జారాడకు చెందిన భజరంగ బాధ్యత(32) అనే యువకుడు విశాఖపట్నం డాక్‌యార్డులో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం తన బావమరిదికి ఫోన్‌చేసి సాయంత్రం 5 గంటలకు విశాఖలో బయల్దేరి ఊరెళ్తానని చెప్పాడు. సరిగ్గా రాత్రి ఏడున్నర గంటలకు తమ్మినాయుడుపేట ఎన్‌హెచ్–16 వద్దకు వచ్చేసరికి గేదె అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన ఆయనను స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



ఎస్‌ఆర్‌సీపురం మెయిన్ రోడ్డులో విష్ణుమూర్తి విగ్రహం

ఆధ్యాత్మిక శోభ

కంచిలి గ్రామ దేవత కంచమ్మ తల్లి ఉత్సవాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మెయిన్ రోడ్డులోని పీఠస్థానం నుంచి బలియాపుట్టుగ కాలనీ వీధుల్లో బుధవారం ఊరేగించారు. అమ్మవారితోపాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. అదేవిధంగా గ్రామం అంతటా ఏర్పాటు చేసిన పలు రథాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. - కంచిలి



రైల్వేకాలనీలో అభయాంజనేయ విగ్రహాలు



అశోక్ నగర్‌లో శ్రీరాముడి విగ్రహం



కంచమ్మ తల్లి కాలనీలో విగ్రహం

వంశధారలో జలకళ

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార నది నీటితో కళకళడుతోంది. జూన్ మొదటి వారానికి రుతుపవనాలు రావడం, ఒడిశాలో వర్షాల ప్రభావంతో రెండు రోజులుగా నీటి ఉధృతి పెరుగుతోంది. నిన్నమొన్నటి వరకూ నదిలో చుక్క నీరులేక ఎండిపోయి కనిపించిన నది నేడు జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం నీటిని కాలువల ద్వారా విడిచిపెడితే చెరువులను నింపుకుంటామని నదీతీర ప్రాంత గ్రామాల రైతులు కోరుతున్నారు.



కొమనాపల్లి వద్ద వంశధార నదీ ప్రవాహం

కొట్లాటలో ఇరువురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు ఒక స్థలం విషయం గొడవపడి తీవ్రగాయాలకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తొలుసూరుపల్లి గ్రామం సమీపంలో హనుమంతు సింహాచలం, గూన భుజంగరావుకి ఓ ఇంటి స్థలానికి సంబంధించి ఇరువురికీ ధ్రువపత్రాలు ఉన్నాయని కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. అయితే హనుమంతు సింహాచలం ఆ స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండడంతో మరోసారి వారి ఇరువురి మధ్య బుధవారం తగాదా చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. దీంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి

- జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేయాలి
- జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకుల విన్నపం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిరుపేద దళితుల జీవితాలతో ఆటలాడుకోవడం సరికాదని దళిత సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, రుణాల మంజూరులో బినామీల పాత్ర పెరిగిపోయిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం హాల్‌లో బుధవారం రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ అధ్యక్షతన ఎస్సీ సంఘాల నాయకులతో సమీక్ష సమావేశం జరిగింది. స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, ఇన్నోవా కార్లు వంటి పెద్ద మొత్తంలో రుణాలు బినామీల పేరుతో మంజూరవుతున్నాయని ఆరోపించారు. స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియకముందే వెబ్‌సైట్లు మొరాయిస్తున్నాయని, దీంతో అర్హులైన వారు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు లేవు

జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని దళిత జేఏసీ నాయకులు విమర్శించారు. కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతకు పారిశ్రామిక ప్రోత్సాహం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న రుణాలను ఎమ్మెల్యే, ఎంపీలు సిఫార్సులు చేసిన వారికి కాకుండా, నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్‌కు చెందిన విలువైన భూములను పరిరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారని, భూమి కొనుగోలు పథకం పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళిత సంఘాల నాయకులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రుణాలకు లబ్ధిదారుల ఎంపికలో సిబిల్‌తో సంబంధం లేకుండా మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గడ్డెమ్మ, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనేల అప్పారావు, దళిత మాల సంఘాల నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు, పోతల దుర్గారావు, మట్ట పురుషోత్తం, బత్తిన మోహన్‌రావు, డి.గణేష్, అంపోలు ప్రతాప్, చల్లా రామారావు, గుత్రాల చినబాబు, చింతాడ శ్రీనివాసరావు, పొట్నూర్ రమేష్, చిన్నారావు, కుమిలి రాజేష్, దువ్వాన అప్పలసూరి, బెలమర ప్రభాకర్, బొంపల రమణ, దీర్ఘాసి తిరుమలరావు, పెయ్యల చంటి, అబ్బాస్, డి.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు